కథానిక

# ఓడిపోయిన సావిత్రి

ఇచ్ఛాపురం జగన్నాథరావు

అందరూ గొల్లుమన్నారు... గుండెలు పగిలేలాగ ఏడ్వసాగారు. వీటికన్నిటికీ అతీతుడై, ప్రశాంతంగా కళ్ళు మూశాడు రామారావు.

అంతా హఠాత్తుగా జ్వరంవచ్చింది. ఆఫీసుకి నాలుగురోజులు సెలవుపెట్టాడు. మూడోరోజున సంధిలోకి దింపింది. ఆ రాత్రి కొంత శాంతించింది. నాలుగోరోజు ఉదయం శాశ్వతంగా లోకానికే సెలవుపెట్టాడు రామారావు.

ఈ ఏడుపుల్లో లీనమై,వీళ్ళందరికన్నా గుండెలు కాలుతూన్న సావిత్రి ఏడవలేకపోయింది. ఈ మరణం వస్తుందని అనుకున్న దగ్గరనించీ ఆమె కింక మతిపోయింది. పాతికఏళ్ళ సావిత్రి... ముప్ఫైదాటిన రామారావు. సౌఖ్యంగా నడుస్తూన్న జీవితంలో హఠాత్తుగా ఈ హాలాహలం. సావిత్రి ఇంక ఏడ్వడానికికూడా అశక్తురాలు.

ఆమె లేచి గదిలోకిపోయి ఏడుస్తూ మంచం మీద వాలింది. రెండురోజులనించి తిండిలేదేమో ముఖం తిరిగింది. దట్టంగా చెమటపోసింది. అందరూ అటు పరిగెట్టారు.

ఒక పావుగంట... "పాపం! ఎంత కష్టం వచ్చింది" అని ఒకరు "నిన్నటి్నించి మంచి నీరు ముట్టలేదాయెను" అని ఒకరు "కాస్త గాలి తగలనివ్వండి" అని ఇంకొకరు.

ముఖాన్న చల్లటినీళ్లు చల్లి కొంతగాలి తగల నిచ్చారు. సావిత్రి తేరుకుంది. కొంచెం వేడి పాలు ఇచ్చారు తాగింది. వాకిటఉన్న శవం మాట మరచిపోయింది.

"నాన్నా!"

"నాన్నా!"

త్రుళ్ళిపడి, ఒక్కసారి జాగ్రదవస్థలోకి వచ్చినట్లు పరిగెట్టింది సావిత్రి. రెండేళ్ళ పాపాయ్ తండ్రిని పిలుస్తున్నాడు. ప్రాణం లేకపోతే మాట్లాడరని వాడికేం తెల్సు?

"నాన్నా!"

పొంగి పొరలి వచ్చింది దుఃఖం సావిత్రికి. ప్రతిరోజూ వాడిని ఎత్తుకుని, ఊరంతా తిప్పి తీసుకునివచ్చేవారు. ఆయనదగ్గర తప్ప వాడు పడుకోడే. ఉదయం ఆయనలేపాలి.

"నాన్నా!"

పాపాయ్ పిలుస్తున్నాడు. "బాబూ!" అంటూ గాద్గదికంగా అరిచి, వాణ్ణితీసుకుని గుండెలకి హత్తుకుంది సావిత్రి. వచ్చీరాని మాటలు. "అమ్మా, నాన్నా" అన్నాడు.

సావిత్రికి ఇప్పుడు పూర్తిగా తెలిసివచ్చింది తానేమిటి కోల్పోయిందో. ఇంతవరకూ ఆ ఘోరాన్నామె నమ్మలేకపోయింది. కాని పాపాయ్ ఆ దుర్వార్తని ఋజువు చేస్తున్నాడు.

"లోనికి తీసుకునిపో అమ్మా!"

తండ్రి బాష్పరుద్ధకంఠంతో అన్నాడు. అంతకన్న చేయాల్సిన పని కనిపించలేదు సావిత్రికి.

"నాన్న ఏడమ్మా?"

"వస్తారమ్మా..."

తలగడా తడుస్తోంది. క్రిందని ఏడుపులు ఎక్కువౌతున్నై. క్రమంగా అంత్యక్రియలు జరపడానికి సన్నాహాలు చేస్తున్నారు.

ఇంక అక్కడికి దూరంగా ఉండలేకపోయింది సావిత్రి. మంచం దిగింది పాపాయ్ వెంటబడ్డాడు. వాడినెత్తుకుని హృదయానికగట్టిగా అదుముకుంది-"ఇంక మనం ఒకళ్ళ కొకళ్ళమే బాబూ" అనుకుంటూ.

అమె క్రిందికి వెళ్ళేసరికి అంతా సిద్ధమైంది.

సావిత్రికి చుట్టూ ఇంకేమీ కనపడలేదు. అట్లానే కూలబడ్డది.

"నాన్న ఎక్కడికెళ్తున్నాడే?"

ఆమాట లామెకి వినిపించే ఉంటై. వాడిని దగ్గరకి తీసుకుంది అంతే. ఇంకేమీ ఆమెకి తెలీదు. ఆప్రశ్న పాపాయ్ నాలుగుసార్లు అడిగాడనీ తెలీదు.

ఆ సాయంత్రం చీకటిపడింది. లోకంఅంతా, కాలికాలి ఆరిన గ్రామంలాగ కనిపిస్తుంది సావిత్రికి, పాపాయ్ నిద్రపోయాడు. ఏవోమంత్రాలు చదువుతున్నారావతల ఇంట్లో చాలా దీపా లుంచారు. కాని మనస్సులో చీకటిని అవేమిటి చేస్తాయి?

ఐదేళ్ళ తన దాంపత్యజీవితం జ్ఞప్తికివచ్చింది సావిత్రికి. ఎంత ఆనందంగా గడిచాయి ఆ ఐదేళ్ళూను! ఒక్కసారికూడా కోపం తెచ్చుకోనిమనిషి రామారావు. చిరునవ్వుతో ఎప్పుడూ చూస్తే చాలును, పాపాలుపోతా యన్నట్లుండే వాడు.

ఇంక తాను బ్రతికి లాభంఏమిటి? ఇంతటి సౌఖ్యపుదినాలని తలుచుకుంటూ, బ్రతికీ అను దినమూ అనేకసార్లు చావడంకన్న, ఒక్కసారి చనిపోతే సౌఖ్యంకదూ? ఎవరికోసం బ్రతకాలి? ఏం అనుభవించడానికి మనస్సులో ఇంతటి అగ్నిని భరిస్తూ బ్రతకాలి?

బాల్కనీమీద పిట్టగోడకి ఆనుకుని ఆలోచిస్తూంది సావిత్రి. "లేచావా అమ్మా!" అంటూ మీదికివచ్చారు సీతారామయ్యగారు.

"లేచా నాన్నా" అంది సావిత్రి.

"చూడమ్మా జరగాల్సిందేదో జరగరానిదే ఐతే జరిగిపోయింది. చాలా బరువైన దుఃఖమని నాకూ తెల్సునమ్మా. కాని..."

"ఏమిటి నాన్నా?"

"నాకు తెల్సునమ్మా నీ ఆలోచన లెలా ఉంటాయో కాని పాపాయ్‌ని మరిచిపోకు ఎవరు పెంచుతారు వాడిని? నే నెలాగూ కాటికికాళ్లు చాచుకున్నవాడినే తల్లిదగ్గర తప్ప వాడు బ్రతక లేడు. ఈ మాటలుమాత్రం జ్ఞప్తికి పెట్టుకో అమ్మా. నీవెనక రెండు ప్రాణాలు."

ఆయన ఇంక మాట్లాడలేకపోయాడు. కళ్ళు ఒత్తుకుంటూ వెనుదిరిగాడు.

సావిత్రి మనస్సంతా కలసిపోయి ఉంది. ఆమె తిరిగి గదిలోకి వెళ్ళింది. పాపాయ్ నిద్ర పోతున్నాడు.

"బాబూ!"

నెమ్మదిగా పిల్చింది సావిత్రి. వాడు నిద్ర పోతున్నాడు. అలానే నిలబడి వాడి కళ్లల్లోకి చూసింది. అమాయకంగా కళ్ళు మూసుకుని నిద్రిస్తూన్న వాడినిచూసి అనుకుంది. "నిన్ను మోసం చెయ్యగలనా బాబూ!" అని.

"సావిత్రీ!"

అత్తగారు వచ్చి ఆమెని రెండుచేతులతోనూ పట్టుకుని అవతలికి తీసికెళ్ళింది. "పదమ్మా-రెండు మెతుకులు తిందువుగాని" అంటూ.

"నా కాకలిలేదత్తా."

"ఎట్లా ఉంటుందమ్మా అంతకష్టం వచ్చాక? కాని, ఎలాగో వచ్చి రెండు మెతుకులు తినమ్మా"

ఇంక సంభాషణ సాగించినా కన్నీళ్ళే మాట్లాడుకోవాలని తెలుసు నిద్దరికీ. సావిత్రి మేడ గ్రిందికి వెళ్ళింది.

ఎనిమిదయేసరికి తిరిగి మీదికివచ్చింది సావిత్రి. వచ్చేసరికి బాబులేచి కూర్చుని దిక్కులు చూస్తున్నాడు. ఫ్లాస్కులోని పాలు గ్లాసులో పోసి పెడుతూంటే సగంతాగి, "నాన్నఏడే అమ్మా?" అన్నాడు వాడు.

"వస్తారమ్మా"అంది సావిత్రి కష్టంతో గొంతు సవరించుకుని.

"ఇప్పుడే కావాలి."

సావిత్రిచేసే దేమీలేకపోయింది బాబు పాలు తాగనని కూర్చున్నాడు.

"ఊరి కెళ్ళారమ్మా-మంచివాడవుగా, పాలు తాగు."

"ఎప్పుడొస్తారమ్మా?"

"వస్తారమ్మా...పాలు తాగు."

బాబు అతిష్టంగానే మిగిలినపాలు తాగేడు. సాయంకాలమంతా నిద్రపోవడాన్ని వాడికింక నిద్ర పట్టలేదు. సావిత్రి నిద్రపోయేస్థితిలోలేదు. ఆగదిలో గడిచినరోజులూ, సంఘటనలూ ఆమెకు జ్ఞప్తికి వస్తున్నాయ్. మధ్యన బాబు అడుగుతాడు: "నాన్నగారెప్పుడొస్తారే?" అని. "వస్తారు బాబూ" అంటుందామె. మళ్ళాగాయం అంతా రేగుతుంది. మళ్ళా ఆలోచనలు మొదటినించీ ప్రారంభిస్తాయ్. ఎన్నాళ్ళీ పిల్లవాడినిలా మభ్యపెట్టడం? ఇదో క్రొత్త సమస్య అయిపోయింది.

రాత్రి పన్నెండయింది. లైటు వెలుగుతూంది. బాబు మంచంమీద పడుకుని కళ్లు మూశాడు "నాన్నగారొస్తే లేపు అమ్మా"అని చెప్పి, నెమ్మదిగా నిద్రపోయాడు.

లేచి బాల్కనీదగ్గరకివచ్చింది సావిత్రి. అమావాశ్యరాత్రులు. కన్నుకన్ను పొడుచుకున్నా కనిపించని రాత్రులు. మ్యునిసిపల్ దీపాలు అన్నీ ఆర్పేశారు. చుక్కలుమాత్రం కనిపిస్తున్నాయ్. ఈ అనంతవిశ్వంతో తన హైన్యాన్ని ఒక్కసారి గుర్తించుకోసాగింది సావిత్రి. ఎన్నికోట్ల మనుష్యులలో తానొక్కతె? ఈ మహావిశ్వంలో తానెన్నోవంతు? తను బలవంతాన చనిపోతే, ఎక్కడికి పోతుంది? రామారావు కనిపిస్తాడా?

ఏదో ఆలోచనవచ్చి ఒక్కసారి ఒళ్ళు గగుర్పొడిచింది సావిత్రికి. పెళ్ళయి తాను కాపురానికి వచ్చిన కొత్తలో ఒకనాడు రామారావు ఆలశ్యంగా ఇంటికి వచ్చాడు—పన్నెండు దాటింది. తనకి నిద్రపట్టలేదు. ఇక్కడే వచ్చి నిలపడి, ఇలాగే చీకట్లోకి చూస్తూ ఏవో ఆలోచనల్లో మునిగిపోయింది. ఆలోచనల్లోపడి అతను వచ్చిన సంగతికూడా గ్రహించలేదు. భుజంమీదచెయ్యి వేసి,"ఏమిటమ్మాయ్, అంత ఆలోచన?"అన్నాడు లాలనగా రామారావు. తనకొక్కసారి ప్రాణం లేచివచ్చినట్లైంది. ఎంత ఆందోళనగా ఎదురు చూసింది ఆయనకోసం!

మళ్ళా ఆలాజరుగుతుందా?

సావిత్రికి బ్రతుకుమీదరోత ఒక్కసారి ఎక్కువయింది. మళ్ళా ఒక్క సుఖవంతమైన దినాన్ని కూడా గడపడానికి తనకి ఆశలేదు. ఈ జ్ఞప్తుల బాధలు ముళ్ళల్లే గుచ్చుకుని బాధిస్తూంటే కుములుతూ ఎందుకూ బ్రతకడం?

బాల్కనీమించి క్రిందికి చూసింది సావిత్రి. ఒక్కసారి క్రిందికి దుముకితే చాలును. లేదా, బీరువాలో ఎర్రని మందు మంచినీటిలో కలుపుకున్నా చాలును. ఆయనే చెప్పారు ఒకనాడు. అది ఎందుకో తెచ్చారు.

ఒకసారి తండ్రిమాటలామెకి జ్ఞప్తికివచ్చాయ్-
"నీవెనుక రెండుప్రాణాలు."

లెక్కఎవరి? అనుకుంది సావిత్రి. చనిపోయే వాళ్ళకివన్నీ ఎందుకు? ఆయన ఇవన్నీ ఆలోచించే చనిపోయారా?

తొందరగా లోపలికివెళ్ళి గ్లాసులో కొంచెం నీళ్ళుతీసింది. బీరువాతీస్తూంటే చెయ్యి వణికింది. కాని బలంతెచ్చుకుని తలుపు తీసింది. ఆ సీసా వెదకి చేత్తోపట్టుకుంది.

బీరువాచప్పుడికి బాబు కదిలాడు. సావిత్రి వాడి మంచంవైపు తిరిగింది. వాడింకా ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

సీసా, నీరూ, టేబిల్మీద ఉంచి సావిత్రి ఆలోచించసాగింది, ఉదయం ఇంట్లో పరిస్థితి ఎలాగ ఉంటుంది? అని.

అందరూ ఏడుస్తారు. ఆ గోలమధ్య, బాబు, "అమ్మా, అమ్మా" అంటూ ఏడుస్తాడు. అందరూ వాడిని ఓదార్చడానికి ప్రయత్నిస్తారు. కాని వాడు ఏడుస్తూనే ఉంటాడు. "అమ్మా! అమ్మా!"అంటూ అంతా అయోమయంగా ఉంటుంది వాడికి. వాడికి చేతనైన ఒక్క పనీ వాడు చేస్తాడు. ఏడ్వడం—కన్నీళ్ళతో ముఖమూ, బట్టలూ తడుస్తాయి. కళ్లువాచుతాయి. అమ్మ పలకదు. నాన్న ఏడే? ఏడుస్తాడు గుండె పగిలేలా.

"ఒద్దుబాబూ,"అరచినట్లన్నది సావిత్రి. ఇంక ఆ దృశ్యం ఊహించుకోలేకపోయింది. దిక్కులేని బాబుని ఊహామాత్రంగానైనా ఆమె భరించలేదు.

సీసా తిరిగి బీరువాలోపెట్టి బాబుదగ్గర మేను వాల్చింది. వాడు ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

ఆమెకెప్పుడు నిద్రపట్టిందో తెలీదు. బాబు లేపుతున్నాడు, లేచి కూర్చుంది.

"అమ్మా! నాన్న ఏడే? రాలేదేం?"

"వస్తారమ్మా."

సావిత్రిమనసు మొద్దుబారిపోయింది. ఇదంతా తప్పనిదిగా సరిపెట్టుకుని రాబోయేదానికి సిద్ధపడింది.

చాలామంది చుట్టాలు. వెళ్ళిపోయారు మిగిలినవాళ్ళీపూట వెళ్ళిపోతున్నారు. అమ్మవాళ్ళని తనదగ్గరికిరాకుండా పంపేస్తూంది. ఇల్లు కొద్దిసేపట్లో ప్రసాంతంగా అయిపోయింది.

బాబుని ఎత్తుకుని క్రిందికిదిగింది. ముఖం కడుక్కుంది. అమ్మ కాఫీ తెచ్చి ఇచ్చింది. బాబుకి పెట్టి, తానూ త్రాగింది.

"నాన్నేడే అమ్మా?"

అక్కడున్న వాళ్ళందరూ కళ్ళు తుడుచుకున్నారు. మాట్లాడకుండా మేడమీదికి పోయింది సావిత్రి బాబుతో.

సావిత్రి తన దుఃఖానికి వేదాంతాన్ని కట్టు గా వేసుకోగలిగింది. కాని పిల్లవాడికి ఏం జవాబు చెప్పాలో ఆమెకి తోచలేదు. ఆరోజంతా వాడు నాన్నగారిని అడుగుతూనే ఉన్నాడు.

"నాన్న చనిపోయారు; ఇంక తిరిగిరారు" అని ఎలాగ వాడికి బోధపరచడం? వాడికి మరణం ఏమిటి తెలుస్తుంది? వాడికి కావాల్సింది నాన్నగారు. నాన్నగారే వాడికి కావాలి. ఈ వివరణలూ, జవాబులూ వాడికక్కర లేదు. వాడి భాషలో వాడికిదంతా — ఈ అనివార్యత్వాన్నీ, వేదాంతాన్నీ బోధించగలిగేదెవరు?

"అమ్మా, నాన్నారు కావాలే."

"వస్తారమ్మా"

ఆ దినమంతా ఈ అసత్యాన్ని ఎన్నోసార్లు వల్లించింది సావిత్రి. గత్యంతరం లేదని ఆమెకి తెల్సును. కాని దీని అంతం ఎప్పుడోమాత్రం ఆమెకి తెలియలేదు. ఒకసారికన్న ఒకసారి ఈ అసత్యవాదన కష్టతరం అవుతూంది.

ఆ సాయంత్రం బాబు కన్నీరుపెట్టాడు. సావిత్రి గుండెలు పొడిచినట్లైంది, ఎలాగో ఆ క్షణానికి మరికొన్ని అసత్యాలతో వాడిని మభ్య పెట్టగలిగింది. కాని, ఆమెకి భయమే ప్రారంభించింది వాడివిషయంలో.

రాత్రంతా బాబు మధ్యమధ్య లేస్తూనే ఉన్నాడు. నాన్నగారికోసం ఆమెని అడుగుతూనే ఉన్నాడు.

తెల్లవారి లేచేసరికి బాబు ఒళ్ళు వెచ్చగా ఉంది. సావిత్రిగుండెల్లో రాయిపడింది.

* * *

"అమ్మా" అంటూ తల్లిని కౌగలించుకుని గుమ్మంలోనే కన్నీటితో కూలబడ్డాడు ప్రకాశం. అన్నపోయిన సంగతి, పరీక్షలని, స్నేహితులు చివరిరోజుదాకా దాచారు. పరీక్షలవగానే వాళ్లు సంగతి చెప్పారు; ప్రకాశం రెక్కలుగట్టుకుని వచ్చి ఇంటిదగ్గర వ్రాలాడు.

రామారావూ ప్రకాశమూ, పరస్పర మూర్తిభవించిన ప్రాణాలు. ప్రకాశం ఢిల్లీలో చదువుకుంటున్నాడు. ఈ సంవత్సరం ప్రతీ సెలవులలోనూ ఏవో ఎక్స్కర్షన్ పోవాల్సి వచ్చింది. అంచేత సంవత్సరమంతా రా మా రా వు ని చూడలేక పోయాడు. నిగుడు ఒక నెలమాత్రం ఇంటిదగ్గర ఉన్నాడు.

అన్నదమ్ములిద్దరికీ ఎంత ఆప్యాయతో, వాళ్ళకి భౌతికంగాకూడా అంత పోలిక. ఇద్దరికీ రెండేళ్లు మాత్రమే వయస్సులో భేదం, కాని, ఒక్కసారి చూస్తే ఇద్దర్నీ వేరువేరుగా పోల్చుకోవడ సీ కష్టం. అంత సన్నిహితులు అన్నదమ్ములు.

జట్కావాడికి డబ్బులిచ్చిపంపింది సావిత్రి.

పొంగిపొరలి వచ్చే దుఃఖాన్ని కష్టంగా ఆపుకుంటూ అక్కడ కుర్చీలోకూలబడ్డాడు ప్రకాశం. ఆమెని ఓదార్చాలనుకున్నాడు. సావిత్రికి అతని దీనస్థితి చూచేసరికి అతన్ని ఓదార్చాలనుకుంది. ఇద్దరూ ప్రయత్నించారు. ఎవ్వరూ మాట్లాడలేక పోయారు కన్నీళ్లయితే ధారాళంగా రాసాగాయి. సావిత్రి మేడమీదికిపరుగెట్టి వెళ్లిపోయింది.

సాయంత్రానికి బాబు జ్వరం పూర్తిగా హెచ్చింది. జ్వరంలో పలవరింతలు, "నాన్నా!, నాన్నా!" అని. మధ్యమధ్య అమ్మని పిలిచి అడిగేవాడు-"నాన్నారు వచ్చేరా?" అని.

రాత్రంతా సా వి త్రి వాడి మంచందగ్గర కూర్చుని కాపలాకాసింది. ఉదయానికి వాడిబాధ విపరీతం అయిపోయింది. ఆగకుండా నాన్న కోసం పలవరింతలు. ఒంటిమీద తెలివిలేదు.

సావిత్రి కేమీ తోచలేదు. బాబు ఏమౌతాడో ననేబెంగ ఆమెకి కొత్తబాధగా తయారైంది. పిచ్చిగా వాడిని గుండెలకి హత్తుకుంటుంది. ఏడుస్తూ వాడి చెంపలు నిమురుతుంది. బాధగా వాడిని పిలుస్తుంది. వాడు పలకడు. ఆమెని కౌగలించుకుని, "నాన్నా రేరీ?" అంటాడు ఆమె బాధకి అంతు ఉండదు. ఏడుస్తుంది. కొంత సేపటికి బాబూ ఏడుస్తాడు. అప్పుడామె ఊరుకుంటుంది. వాడిని ఓదారుస్తుంది.

ప్రకాశం డాక్టర్ని పిలుచుకునివచ్చాడు. డాక్టర్ బాబుని బాగా పరీక్షించి, "జబ్బు తీవ్రత కన్న పలవరింతలు సూచించే మానసిక సంఘర్షణ ఎక్కువ బాధిస్తోంది. దానికేమైనా విరుగుడు చూడాలి" అన్నాడు.

"ఏం చెయ్యమంటారు?" అన్నాడు రామారావు, గుమ్మందిగుతూ డాక్టరుతో.

"నేనేం చెప్పేది? మరే ఆలోచించండి. ఇలాగేనడిస్తే ఒకటిరెండు రోజుల్లో ఏమైనా జర

గొచ్చు" అన్నాడు డాక్టర్. సావిత్రి ఇదంతా విన్నది. ఏంచెయ్యాడమో తోచక, వచ్చి గదిలో కూర్చుంది. బహుశా తనదారిలో ఉన్నా మరొక అడ్డంకిని భగవంతుడు తొలగిస్తున్నాడా?

ప్రకాశం నీరసంగావచ్చి గదిలోకూర్చున్నాడు. ఈ రెండు సంవత్సరాలలోనూ అతనా గదికి రావడం అది మొదటిసారి. సావిత్రి కళ్లుతుడుచుకుంటూ, "ఆశ లేదన్నమాటేగా ప్రకాశం?" అన్నది.

"ఎవరన్నారొదినా?"

"డాక్టరు మాటలు నేను విన్నాగా?"

"ఎందుకు విన్నావు?"

"వచ్చేదాన్ని తెలుసుకోక పోయినంత మాత్రాన అది ఆగదుగా? ఇంకా నామీద దేవుడు తీర్చుకునే పగలేమున్నాయి ప్రకాశం."

సావిత్రి కన్నీటిని తుడుచుకుంది.

"ఇందాకా ఇంజక్షను ఎందుకిచ్చినట్టు?"

"తెలివి రావడానికి, అదుగో-వాడు కదుల్తూనే ఉన్నాడు. ఫ్లాస్కులో పాలున్నాయా?"

"ఉన్నాయి."

బాబు నెమ్మదిగా కళ్లుతెరిచాడు. జ్వరం తీవ్రత తగ్గి, చెమటపోసింది. "అమ్మా!"అన్నాడు నీరసంగా.

సావిత్రికి నీటిలో ముంచిముంచి ఒడ్డున పడవేసినట్లుంది. కాని, తరువాత బాబు వెయ్యబోయే ప్రశ్న ఆమెని కలవరపెడుతున్నది. నెమ్మదిగా సావిత్రి గ్లాసులో పాలుపోస్తూంది.

"నాన్నగారు! నాన్నగారు!"

బాబు ఆనందంగా అరుస్తున్నాడు. ఒక్కసారి వాడికెక్కడలేని శక్తీవచ్చి మంచంమీద నిలబడ్డాడు.

"రండి. ఎత్తుకోండీ, నాన్నగారూ!" చేతిలో పాలు జారిపోయాయ్ సావిత్రికి. ఈ హఠాత్తుగా వచ్చినమార్పు సంతోషమో, భూతమహిమోనని ఆమె హడలిపోయింది. "ఏం శిక్ష వేస్తున్నావ్ భగవాన్!" అనుకుంది.

"నాన్నారూ!"

ప్రకాశం వాడి మంచందగ్గరకి పరిగెత్తాడు వాడు దిగబోవడం చూసి. బాబు ప్రకాశం పీక గట్టిగా పట్టుకున్నాడు.

"ఎక్కడి కెళ్ళేరండీ?"

ప్రకాశం తెల్లబోయాడు. సావిత్రి మొదట దిగ్భ్రమచెందింది. తరువాత, వాడి బ్రతుక్కి ఫరవా లేదనే సంగతితెలిసి, సంతోషించింది. బాబు ప్రకాశాన్ని గట్టిగా పట్టుకున్నాడు. భుజంమీద తలవాల్చాడు.

"కొంచెం పాలుతాగు బాబూ!"

ప్రకాశం వాడిని సావిత్రిచేతికి యివ్వబోయాడు. కాని వాడు పోలేదు. "మీరు పట్టండి నాన్నగారూ!" అన్నాడు.

ఈ పరిస్థితి ప్రకాశానికీ సావిత్రికీ కూడా చాలా సిగ్గుపరచేదిగా ఉంది. కాని యధార్థాన్ని బయటపెట్టి, వాడిప్రాణం పణం ఒడ్డడం వాళ్ళిద్దరూ చెయ్యలేని పని. ఒకరివంక ఒకరు చూసుకున్నారు.

సావిత్రి తల్లీ, సీతారామయ్యగారూ ఆ క్షణంలో మీదికివచ్చారు. "లేచాడా అమ్మా?" అంటూ.

"ఆ డాక్టర్ ఇంజక్షన్ పనిచేసింది" అంది సావిత్రి తృప్తిగా. వాళ్లు బాబు ప్రకాశంచేతుల్లో ఉండడం చూసి తెల్లబోయి, "చిన్నాన్నదగ్గర అంత చనువా?" అని అడిగారు.

"ఔను" అంది సావిత్రి.

ప్రకాశం బాబుచేత పాలు త్రాగించాడు. బాబు మధ్యమధ్య "నాన్నారూ!" అనిపిలిస్తూ పాలుతాగుతున్నాడు. ఆ పిలుపు విన్నప్పుడల్లా సావిత్రి ఏదో బాధతో కృంగిపోయేది. ప్రకాశం చాలా సిగ్గుపడేవాడు.

రెండురోజులు గడిచేసరికి డాక్టర్ మరేమీ బాధలేదని చెప్పేడు. కాని బాబు ప్రకాశాన్ని నాన్నా అని పిలవడంమాత్రం మానలేదు.

మూడో రోజున తల్లిచాటుగా సావిత్రిని పిలిచి: "వాడు నాన్నా, నాన్నా అని మరిదిని పిలుస్తూంటే ఊరుకుంటూ లేమమ్మా? తప్పని చెప్పొద్దూ?" అన్నది.

సావిత్రి తెల్లబోయి, "ఏమమ్మా?" అన్నది.

"ఏమేమిటీ? అందరూ ఏమనుకుంటారూ? నువ్వు అమ్మనీ, అతనా నాన్న ఏమిటీ?" అంది.

"నువ్వేమనుకుంటావు?" అంది సావిత్రి.

"నేననుకోడానికేముందే? కాని తప్పు అని చెప్పక తప్పదుసుమా! నేను కాస్త అలవాటు చేస్తాను."

సావిత్రికి కొంచెం ఒళ్లు తెలియ[illegible] నువ్వలాంటి పనేమీ చెయ్యడానికి వీల్లేదు. బాబు బ్రతికి బాగుండాలని నా ప్రార్థనలు విని భగవంతుడే ఇలా సహాయం చేశాడని నే ననుకుంటూంటే - మీ అనుమానాలూ, ఆచారాలతో వాడి కొంప ముంచుతారు కాబోలు" అంది.

తల్లి తెల్లబోయింది, మాట్లాడలేదు.

ప్రకాశానికి పరిస్థితి మరీ బాధాకరంగా వుంది. వీధిలోకి వెళ్ళినా బాబు వెంటపడతాడు. "నాన్నా" అని వాడు పిలుస్తూంటే అందరూ ప్రశ్నార్థంగా చూస్తారు. కొందరు అడుగుతారు - తెలియక. జవాబులివ్వడం చాలా బాధాకరంగా ఉంటుంది. చాలా కాలం ఇంటిదగ్గరే గడుపుతున్నాడు ప్రకాశం.

కర్మలూ అవీ అయాక సీతారామయ్యగారు పిల్లని ఇంటికి తీసికెళ్తానని వియ్యపురాలితో అన్నారు. "ఇంక దానికేముందమ్మా ఇక్కడ? కొన్నాళ్ళక్కడ ఉంటుంది" అని చెప్పారు.

సావిత్రి అత్తగారు అంగీకరించింది.

సాయంత్రం బాబుని తీసుకుని ప్రకాశం షికారుకి కాబోలు వెళ్ళాడు. సావిత్రి బాల్కనీ దగ్గర కూర్చుని ఏదో ఆలోచించుకుంటూంటే అమ్మా నాన్నా వచ్చారు.

"...రేపు ప్రయాణమమ్మాయ్" అన్నాడు తండ్రి.

"నాలుగురోజులుండరా నాన్నా?" సావిత్రి ఇంకా పెరటిదారినే ఉన్నది.

"ఇంక మనకేముందే ఇక్కడ? బట్టలు సర్దుకో. పొద్దుట రైలుకి వెళ్ళిపోదాం" అన్నది తల్లి.

"నేనూనా?" అన్నది సావిత్రి విస్తుపోయి.

"ఆఁ. మీ అత్తగారితో చెప్పానుగా. వెళ్లమంది. ఇంకెందుకమ్మా నువ్విక్కడ? అప్పుడూ అప్పుడూ చూసిపోతూ ఉండొచ్చును." అని తల్లి అంది.

కొంచెంసేపు సావిత్రి నిశబ్దంగా ఊరుకుని, "నేను ఇప్పుడింటికి రాను నాన్నా" అంది.

వాళ్లిద్దరూ తెల్లబోయారు.

"ఏమిటే నువ్వంటున్నది?" కొంచెం గట్టిగా అడిగింది తల్లి.

"ఇంటికి రానంటున్నాను."

[illegible] మీద వేసుకుని, "ఎందుకు రావూ? ఇక్కడేం చేస్తావే? మేం చేదయ్యామా?" అన్నది.

"అవన్నీ ఎందుకమ్మా? బాబు అయన్ని వదలి ఇప్పుడు రాలేడు. నాకు బాబు కావాలి. వాడిని బలవంతంగా లాక్కురాలేను, ఇవన్నీ నీకూ తెలుసును" అంది సావిత్రి.

"అయితే అతనికోసం ఇక్కడే ఉండిపోతా వన్నమాట!"

"బాబుకోసం... నేను ప్రస్తుతం ఎక్కడికీ రాను."

"ఇలా మాకప్రదిష్ఠ తెస్తావుటే?"

"అప్రదిష్ఠ ఏమిటమ్మా? చూస్తూ వాడి పీక నులిమెయ్యకపోతే అప్రదిష్ఠ! నా ఇంటినుంచి నేను రానన్నాను..."

"ఇంతదానివనుకోలేదే... దారికొస్తావనే అనుకున్నాను గాని. మొగుడుపోయాక మరిది వెనకాల—"

"అమ్మా!" కోపంగా అరిచింది సావిత్రి...

తల్లి తెల్లబోయింది. సావిత్రి భీకరస్వరూపం చూసి మాట్లాడలేక, ఇద్దరూ క్రిందికి వెళ్లిపోయినారు.

మరికొద్ది నిముషాలకి ప్రకాశం వచ్చాడు. సావిత్రి ఏడుస్తూ పడుకుంది.

"వదినా!"

నెమ్మదిగా పిలిచాడు ప్రకాశం; తొందరగా లేచి ముఖం తుడుచుకుని, "బాబు ఏడీ?" అంది సావిత్రి.

"క్రిందని మా అమ్మదగ్గర ఉన్నాడు."

సావిత్రి క్రిందికి వెళ్ళబోయింది. ప్రకాశం తన గదిలోకి వెళ్తూ, "నువ్విలా ఉంటే కష్టం వదినా. వాడి బ్రతుకు నీమీద ఆధారపడివుంది. అస్తమానం ఏడిస్తే లాభం ఏమిటి? నాకుమాత్రం అన్నయ్య తక్కువ వాడా? కొంచెం సముదాయించుకోవాలి" అన్నాడు.

సావిత్రి తానెందుకు ఏడుస్తున్నదో చెప్దామనుకొన్నది. కాని మొదటికే మోసంవస్తుందని "అలాగే..." అని క్రిందికి వెళ్ళిపోయింది.

అత్తగారు సావిత్రి ఇల్లువదలి వెళ్ళడానికి ఇష్టపడడంలేదన్న సంగతిని మరోలా అన్వయించుకుంది. "పాపం! పచ్చగా ఇక్కడ అయిదేళ్లు

బ్రతికిందాయె. దానికి బుద్ధిపుట్టినప్పుడే వస్తుంది లెండి" అంది.

మర్నాడు ఉదయం సీతారామయ్యగారూ భార్యా రైలెక్కాడు. వెళ్తూ వెళ్తూ తల్లి సావిత్రితో: "మా గుమ్మంఎక్కే అర్హతను కోల్పోతున్నావ్" అన్నది.

వాళ్ళమాట సావిత్రిలెక్క చెయ్యలేదు. కిందికి కూడా దిగిరాకుండానే వాళ్ళని వెళ్ళనిచ్చి, బాబును గుండెలకి హత్తుకుని "నువ్వే నా సర్వస్వమూను" అనుకుంది.

మర్నాటినించి కొత్తరకం జీవితం ప్రారంభమైనది సావిత్రికి. తను తల్లిగానూ, ప్రకాశం తండ్రిగానూ నటిస్తోన్న ఈ నాటకానికి ఆమె ఒక విధంగా పాత్రధారిణి.

అనేక సార్లు ప్రకాశానికి సావిత్రి కన్నీళ్ళతో ఎదురుపడేది-అనుకోకుండా అతను రావడాన్న. ఓదార్చి నాలుగుమాటలు చెప్పి వెళ్ళిపోయేవాడు ప్రకాశం.

ప్రకాశానికి తన కొత్తబంధంలో మొదట ప్రేమ యేమీ లేకుండానే వాడి జీవితం కాపాడగలిగాననే సంతృప్తిమాత్రం మిగిలింది. కాని క్రమంగా వాడి సహచర్యం ఎక్కువౌతూండడంతోపాటు, వాడంటే అభిమానం కలగసాగింది. తననంతగా ప్రేమించిన అన్నకి ఈ లోకంలో చివరికి మిగిలిన సంబంధం వీడొక్కడే. ఒక్కొక్కప్పుడు ప్రకాశానికి వాడిలో తనఅన్న పోలికలెన్నో కనిపించేవి. అతనిగుండెలు కరిగిపోయేవి. బాబుని హృదయానికి హత్తుకుని,"నీకు నా జీవితమైనా ఇచ్చి కాపాడుతాను" అనుకునేవాడు. చివరికి వాడంటే ప్రకాశానికి విపరీతమైన ప్రేమ కలిగింది. మైత్రిసప్తపదీనమంటారు. అది వాళ్ళ విషయంలో యధార్థమైంది.

సావిత్రి తల్లిమాటలనైతే మరిచిపోలేదు. ఏ క్షణంలోనూ ఆమె ఆత్మపరీక్ష మానలేదు, ప్రకాశంవైపు ఏ క్షణంలోనూ ఆమె తేరిపారి చూడలేదు. అతనితో తన సంబంధం వ్యాపార సంబంధం వంటిది—అది స్వార్థంతో కూడినది. తన పాపకోసం అతన్నొకపడిరాయిగాఉపయోగించుకుంది. ఆ పని చేసినందుకామె ఎన్నడూ విచారించలేదు- ప్రకాశంనైజం ఆమెకీ తెల్సునుగనుక. కాని అక్కడితో ఆగడానికీ, ఆ పరిస్థితికి అంతం రాకుండా చూడడానికీ ఆమెప్రయత్నం అంతా.

ఒకనెల ఈ విచిత్రబాంధవ్యం గడిచేసరికి తల్లిమాటలు నిజమని సావిత్రికి తెలిసే పరిస్థితులేర్పడ్డాయి.

ఒకసారి ప్రక్కఇంటి అన్నపూర్ణమ్మ అత్తగారితో మాటలాడుతూ, "కోడలుని పుట్టింటికి తీసికెళ్ళలేదూ?"అన్నది.

"వాళ్లు తీసుకెళ్తామన్నారు. అదే పోలేదు. పాపం! ఏంవెడ్తుంది? మనసొప్పొద్దూ!" అన్నది అత్తగారు.

కొంచెం ఊరుకుని, "ప్రకాశం ఇక్కడే ఉన్నాడా?" అంది పొరుగామె.

"ఆఁ!"

"పెద్దదానివి నువ్వూ ఎలా ఊరుకున్నావో గాని, అందరూ అనుకునే మాటలు బాగులేవక్కయ్యా!" అంది మళ్ళీ.

"ఏమనుకుంటున్నారు!"

"వయసులో ఉన్నవాళ్లు ఇద్దరూ ఉంటే—ఏంబాగుంటుందక్కయ్యా? ఏదోజరిగింది. ఉండవలసినట్లుంటే పరవాలేదు కాని..."

అత్తగారు కొంచెంసేపు మాటలాతలేదు. తరువాత, "ఇలాటి మాటలు అనుకున్నవారిదే పాపం. వాళ్లు తల్లీ కొడుకులల్లే ఉంటారు. పుట్టెడు దుఃఖంతో అది ఏడుస్తూంటే ఇలాంటి అభాండాలెలా వేస్తారో!" అన్నది.

"అవునులే అక్కయ్యా... ఔను" అంది, పొరుగావిడ.

ఇవన్నీ విన్న సావిత్రికి ఒకతెర తీసినట్లయింది కళ్ళనుంచి. కేవలం పవిత్రత ఇలాంటి పుకార్లని నిర్మూలం చెయ్యలేదని ఆమె తెలుసుకున్నది.

ఇదిజరిగిన కొద్దిరోజులకి ఇంట్లోదాసీదీ, పాలమనిషీను గుసగుసలాడకోవడం సావిత్రివింది. వాళ్లు తననెంతనీచంగా చూస్తున్నారో ఆ సంభాషణలో ఆమె గ్రహించింది.

వీటన్నిటికీ తోడుగా మరో సంఘటన జరిగింది. ఒకరోజు ప్రకాశం కొంచెంబాధగా పడుకున్నాడు. సావిత్రి అతని గదిలోకివెళ్లి "ఏం ప్రకాశం అలా ఉన్నావ్?" అంది.

ప్రకాశం కూర్చుని కుర్చీ చూపుతూ "కూర్చో వదినా నీతో చెప్పక తప్పదు చెప్తాను" అన్నాడు.

సావిత్రి కూర్చున్నది. ఆమె గుండెలచప్పుడు ఆమెకే వినిపించేటంత తీవ్రంగా గుండెలు కొట్టుకుంటున్నాయ్ రాబోయే పిడుగు ఏమోనని.

"లోకం మనవిగురించి మంచిగా అనుకోవడం లేదు వదినా!" అన్నాడు ప్రకాశంబాధగా.

సావిత్రి బాధగా తలవంచుకున్నది.

"మనం ఈ పరిస్థితుల్లో ఏం చెయ్యాలో తెలీడంలేదు వదినా. అందరూ మనప్రవర్తనని శంకిస్తున్నారు. నేనేమీ భయపడను. కాని నీగురించే నేను బాధపడుతున్నాను మననిర్దోషిత్వం మనకి తెల్సును. కాని రుజువుచెయ్యడం చాలా కష్టం. ఏం చెయ్యమంటావు వదినా?"

సావిత్రికళ్లు ఎర్రబడ్డాయి.

"నీకూ మాటవస్తుంది ప్రకాశం. ఈ సంగతి నాకింతకుముందే తెల్సును. కాని, నాకై నేను చెప్పలేకపోయాను. ఒక్కటే దారిఉంది—"

ఆమె ఆగింది. ప్రకాశం ఆతృతగా చూశాడు.

"ఎవరిదారి వారు చూచుకోవడం...లోకం నోటిని కప్పలేం ప్రకాశం. సాధ్యమైనంత త్వరలో నేను వెళ్తాను."

ప్రకాశం వెంటనే మాటలాడలేక పోయాడు.

"నేననేది అదికాదు వదినా. పరిస్థితి నీకు తెలియకుండా దాచలేక చెప్పాను. నేను మానసికంగా పిరికివాణ్ని కాదు. నువ్వు వెళ్లిపోవడం అసంభవం, ఏదో ఆలోచిద్దాం"

"ఏమిటాలోచిస్తావ్?"

"ఏమీ చెయ్యలేకపోతే ఇలాగే ఉందాం వదినా. నువ్వు తల్లిలాంటిదానివి. లోకంతో సంబంధం లేకుండా ఉందాం. నా జీవితాన్ని ఈ కూతలేమీ చెయ్యలేవు. నువ్వుధైర్యంచెయ్యి."

సావిత్రి ఏమో ఆలోచిస్తూ బయటికి నడిచింది.

* * *

"ఇవాళ వెంకట్రావు మామయ్యా, శారదా వస్తారట" అన్నది ప్రకాశంతో తల్లి.

సావిత్రి పక్కనఉంది. ఎందుకో ఒక్కసారి ఆమెకళ్లు మెరిశాయి. "శారదవస్తూందా అత్తయ్యా?" అంది.

"ఆఁ. పేసెంజరులో వస్తారట. ఉత్తరం వేశారు."

వాళ్లు వచ్చారు. శారద సావిత్రికి పెదతల్లి కూతురు. శారదకీ సావిత్రికీ విపరీతమైన పోలికలుండేవి. కవలపిల్లల్లా ఉండేవారు. శారద సావిత్రి కన్న రెండేళ్లుమాత్రం చిన్న.

పరామర్శలూ అవీ అయ్యాక "బాబు ఆయన్ని వదలడంలేదటగా?" అందిశారద.

"ఎవరన్నారే?"

"లోకులకింక పనేమిటే? అక్కా నీకేం తెలీదు కాని, ఎంతవిడ్డూరంగా చెప్పుకుంటున్నారంటావ్ మనవాళ్ళంతా? నాకు మాచెడ్డకోపం వచ్చేదిలే"

శారద బి. ఏ ప్యాసయింది. కాని లోకజ్ఞానం తక్కువ. అందుచేతనే ఆమె సావిత్రి ముఖలక్షణాలని త్వరగా కనిపెట్టలేకపోయింది.

"నాకంతా తెలుసునులే" అంది సావిత్రి.

ఆ సాయంత్రం మాటలసందర్భంలో "శారదని ప్రకాశానికిస్తామంటున్నారు" అన్నది అత్తగారు.

"చాలాబాగుంటుందత్తయ్యా. ఈడూజోడూ బాగుంటుంది. నేనే అందామనుకుని ఊరుకున్నాను."

అంతర్యాన్ని దాచలేక పోయింది సావిత్రి. ఆరోజంతా ఆమెకీఆలోచనే. కాని, పైకి చెప్పలేకపోయింది; ఇప్పుడు దాచలేకపోయింది.

"కాని, వాడిమనస్సు తెలియాలిగా"

మర్నాడు సావిత్రి ప్రకాశం గదిలోకి వెళ్ళి కూర్చొని "నీతో మాట్లాడవల్సిన పనుంది" అంది.

"చెప్పు వదినా" అన్నాడు ప్రకాశం.

"ఏముందిలే శారదని చూశావుగదా, ఎలా ఉంది?"

ప్రకాశం నవ్వాడు చిన్నగా— "ఏం?" అన్నాడు.

"అనుమానం వచ్చిందిలే."

"బాగానే ఉంది."

"దాపరికమెందుకు—మీఅమ్మ మీకు పెళ్ళి చెయ్యాలని అనుకుంటున్నారు. నాకూ అది చాలా యిష్టమే. ఒకరోజు నేను నిన్నెందుకామెని వివాహం చేసుకోమన్నానో తెలుస్తుంది. నాప్రార్థనగానైనా ఈపెళ్ళికి ఒప్పుకుంటావా?"

సావిత్రిచాలా గంభీరంగా మాట్లాడుతోంది. ప్రకాశం తెల్లబోయి వింటున్నాడు. శారదలాంటి పిల్లలమీద చక్కని అభిప్రాయాలుండకుండా ఉండడం కష్టం. కాని, సావిత్రి ఎందుకలా పట్టుపడుతూందో అతనికర్థం కాలేదు.

"నువ్వు ప్రార్థించాల్సినంత అవసరం ఏమిటి వదినా?"

ఉండలేక అతనడిగేశాడు. సావిత్రి కష్టంగా చిన్న నవ్వు నవ్వింది. "నేనెప్పుడూ అబద్ధం ఆడను ప్రకాశం. ఇందులో స్వార్థంకూడా ఉన్నా, పరార్థమే ఎక్కువఉంది. నీకు ఏదో ఒకరోజు విడమరచి చెప్తాను. మీ అమ్మగారడిగితే పెళ్ళికి ఒప్పుకుంటావా?"

మంత్రముగ్ధుడిలాగ తల ఊచాడు ప్రకాశం. సావిత్రి "నాకు తెల్సును ప్రకాశం-నువ్వు వదిన మాటలు కాదనలేవని" అని మాత్రం అని వెళ్ళిపోయింది.

తరవాత వ్యవహారాలన్నీ యాంత్రికంగా జరిగిపోయేయి. సంబంధం ఉభయులువాంఛిస్తున్నది. దగ్గరలోనే ముహూర్తం. ప్రకాశమూ శారదా, భార్యాభర్తలయారు.

వధువు ఇంటిదగ్గర మూడునిద్రలూ అయాక తిరిగి స్వగృహానికి శారదతో మరలి వచ్చాడు ప్రకాశం. సావిత్రి వాళ్ళని మనసారా ఆశీర్వదించింది.

* * *

తెల్లవారింది. అందరూ నిద్రలేచారు. ఎవరి పనులు వాళ్లు చేసుకుంటున్నారు. కాని, సావిత్రి కనపడలేదు. ఏడు దాటింది.

"వదిన ఏదమ్మా?" అన్నాడు ప్రకాశం.

"ఇంకా లేవలేదు. ఏమో చూడమ్మాశారదా" అంది తల్లి.

శారద తిన్నగా సావిత్రిపడుకునే గదిలోకి వెళ్ళింది. ఆమె మంచంమీద ఉంది. "అక్కా! అక్కా!" అని పిలిచింది శారద.

సావిత్రి పలుకలేదు. శారద ఆమె వంటిమీద చెయ్యివేసింది లేపడానికి. ఒడలంతా చల్లబడింది.

శారదకేకకి అందరూ మీదికి వచ్చారు పరుగున. మరికొద్ది నిముషాలకి డాక్టరువచ్చి "చనిపోయింది" అని చెప్పాడు.

ఎర్రసీసా, విషంపేరూ అన్నీ సాక్ష్యంగా ఆ ప్రక్కనే ఉన్నాయి. అక్కడే టేబిల్ మీద "ప్రకాశానికి:" అని రాసిన ఒక ఉత్తరంకూడా ఉంది. ఆత్రుతతో అదితీసుకుని చదివాడు ప్రకాశం. ప్రకాశం:

నిన్ను తమ్ముడూ అని పిలవాలని ఉంటుంది. అయినా మనం వదినా మరదులం. పేరుతోనే పిలవనీ.

నీకూ శారదకీ వివాహం కావాలని నా కోర్కె సూచించాను జ్ఞాపకం ఉందా? అంతగా ఎందుకు నాకు మీవివాహం జరగాలని కోరికఉండేదో నీకు తెలియజేస్తానని మాటఇచ్చాను. ఇప్పుడు చెప్తాను.

ఆయనపోయాక నేను బ్రతికినా, ఒక మోడల్లే కదులుతున్నాను. భర్తపోయాక ఇంక ఏమిటి మిగులుతుంది చెప్పు? గడిచిపోయిన భవిష్యత్తులో తిరిగిరాని క్షణాలని నెమరువేసుకుంటూ కాలం గడపడం ఎంతకష్టమంటావ్?

అట్టే కాలం బ్రతకలేనని నాకేనాడో తెల్సును. కాని, నాకు బ్రతుకుతో ముడిపెడుతూ, ఈ ప్రయాణంలో కాళ్ళకి అడ్డంపడుతూ బాబు... ఇంతదాకా నేనీపని చెయ్యకపోవడానికి కారణం అయాడు.

ఆయన పోయాక, నువ్వువచ్చేనాటికి బాబు కెంత జ్వరంగా ఉండేదో జ్ఞాపకం ఉందా? ఒక క్షణంలో నాకు బ్రతుకుమీద ఎంత రోతపుట్టిందంటే పరమాత్మ నాదారిలోంచి ఒకఅడ్డంకి తీసేస్తున్నాడనికూడా అనుకోగలిగాను.

వాడు రెండేళ్ళ పసివాడు.

నీ రూపం చూసి తన తండ్రి అని భ్రమిశాడు. వాడిని రక్షించడానికి, వాడిలోని ఆ మూర్ఖత్వం పనికొచ్చింది. వాడీనాటికీతనతప్పు గ్రహించలేడు.

శారదనిచూశాక, నాకొక ఉపాయం తట్టింది. నువ్వు బాబుని అవసరంకొద్దీకాక, మనసారా ప్రేమిస్తున్నావని నాకు తెల్సును. శారద ముమ్మూర్తులా నాపోలికేగదా! వాడికి నేనులేనిలోటు ఆమెద్వారా తీరుతుంది. మీరిద్దరూ భార్యాభర్తలైతే, వాడికి అమ్మా నాన్నా ఉంటారు గదా! నేను నిర్విచారంగా ఈలోకం వదలొచ్చు.

అందుకే మీ వివాహం జరగాలని వెయ్యి దేవుళ్ళకు మొక్కాను. నిన్ను ప్రార్థించడానికి కూడా వెనుదియ్యలేదు.

నా ప్రార్థనలు ఫలించి, నీ వివాహం నేననుకున్నట్లుగా అయిపోయింది. నాకింక ఈ లోకములో అపనిందలూ, దుఃఖమూ తప్ప ఏముంది? విషం సిద్ధంగానే ఉంది. చనిపోతున్నాను.

బాబుని నా శవాన్ని చూడనివ్వకు. శారదకి వాడిని ఒప్పచెప్పు. వాడికింక తల్లీ-అంతా శారదే.

ఆమెమీద ఈ భారంవేసి నేను నిశ్చింతగా వెళ్లిపోతున్నాను. ఈ ఉత్తరం ఆమెకిచూపు. నిన్ను ఆమెనీ మరొకసారి ఆశీర్వదిస్తున్నాను,

—సావిత్రి.

ఉత్తరం చదివి, శారద చేతిలో ఉంచాడు ప్రకాశం. ఆమెకూడా దాన్ని చదవడంముగించి క్రిందికి వెళ్ళింది.

మధ్యాహ్నంమూడుగంటలయేసరికి సంస్కారాలు పూర్తయాయి. అప్పటిదాకా బాబుని ఇంకో ఇంటికి పంపించారు.

చీకటి పడింది. "నాన్నారూ!" అనిపిల్చాడు బాబు.

ప్రకాశం వెళ్ళి, "ఏం బాబూ?" అన్నాడు.

"అమ్మేదండీ?"

ప్రకాశం గుండెలలో రాయిపడింది. బాబు ఉదయంనించీ శారదతోనే ఉండి ఈ ప్రశ్న ఎందుకువేశాడని.

"ఇక్కడే ఉందిగా—" అంటూ శారదని పిల్చాడు. "ఇదిగో—"అన్నాడు.

శారద వాడిని చేతుల్లోకితీసుకుంది. వాడామె ముఖంలో పరీక్షగాచూసి, "నువ్వమ్మవికాదు" అన్నాడు.

ప్రకాశం వాణ్ణి అనేక విధాల ఒప్పింప చూశాడు. కాని వాడు మాటిమాటికి, "అమ్మ కావాలి..." అనసాగాడు.

శారద వాడి ననేకవిధాల సముదాయించింది. కాని వాడు ఆ అసత్యాన్ని అంగీకరించే స్థితిలో లేడని తెలుసుకుంది.

కొంచెంసేపుపోయాక బాబు ఏడుపు మొదలెట్టాడు-ఒకే పాట అమ్మా!-అమ్మా! అని.

రాత్రంతా వాడలాగే ఉన్నాడు. ఉదయాన అలసిఅలసి నిద్రపోయాడు ఒళ్లు వెచ్చగావుంది.

కొన్నిగంటల నిద్ర తరువాత లేచి మళ్ళా మొదలుపెట్టాడు పిలుపు—"అమ్మా!-అమ్మా!" అని.

శారద వాడిప్రక్కనే కూర్చుంది. అన్ని ఉపచారాలూ చేస్తూంది. తెలివిరాగానే వాడిని తల్లిలాగే పలుకరించేది. కాని వాడు పిలుపు మానలా "అమ్మా! అమ్మా!"

వాడి పిలుపు వాళ్ళ హృదయాలలో కత్తులు గుచ్చినట్లు దిగేది. "ఎంత తొందరపడింది, సావిత్రి!" అని బాధపడసాగేడు ప్రకాశం ఏమిటిదారి?

మర్నాడు సాయంత్రానికి వాడిజబ్బు చాలా తీవ్ర స్థితిలోకిదింపింది. సంధి. ఒకే పలవరింతలు. అదే పిలుపు "అమ్మా!-అమ్మా!" అంటూ విరామం లేకుండా.

డాక్టరు ఏదో ఇంజక్షన్ ఇచ్చాడు రాత్రి నిద్రపట్టడానికి. ఉదయందాకా నిద్రపోయాడు బాబు.

ఉదయం లేచాడు. ప్రకాశమూ శారదా కలిసి కొంచెం పాలు పట్టబోయారు. వాడు ఒక్కచుక్క కూడా త్రాగలేదు. అమ్మని పిలుస్తాడు, వెర్రిగా చూస్తాడు.

మళ్ళా సంధిలోకి దింపింది.

"ఎక్కడికమ్మా పోయావ్? నేనూ రానా? తీసికెళ్ళవూ... వస్తా-అమ్మా"

మళ్ళా డాక్టర్ వచ్చాడు. మంచుగడ్డలు కరుగుతున్నై. "ఈ వయసులో వీడికి రెండోసారి మత్తు ఇంజక్షన్ ఇవ్వడం ప్రమాదం తగ్గితే దానికదే తగ్గాలి" అన్నాడు.

ఆ రోజంతా వాడు పలవరిస్తూనే ఉన్నాడు. ఆ అర్ధరాత్రిదాకా వాడు అమ్మని పిలుస్తూనే ఉన్నాడు. ఒంటిగంటకి అలిసిపోయాడుకాబోలు పడుకున్నాడు.

ఉదయం బాబు కళ్లు తెరిచాడు. టెంపరేచర్ తగ్గింది. నార్మల్‌కి కొంచెంమాత్రం పైగా ఉంది. ఏమీ మాట్లాడడంలేదు. కాని బాధగా, వెర్రిచూపులు చూడసాగాడు.

డాక్టర్‌ని పిలిచారు.

నాడీ, గుండేచూసి డాక్టరు ఒకసారి ప్రకాశంవైపూ శారదవైపూ చూశాడు, తిరిగి వాడి నాడి పరీక్షించాడు.

"డాక్టర్!" అన్నాడు ఆత్రుతతో ప్రకాశం.

నిశ్శబ్దంగా అతని ముఖంలోకి చూస్తూ, స్టెతస్కోపుతీసి జేబులో వేసుకుంటూ నిలబడ్డాడు డాక్టర్. చూపు మళ్ళించి "లాభంలేదు మిస్టర్ కొద్ది గంటలుమాత్రం వ్యవధి" అన్నాడు.

ప్రకాశం కళ్లలో నీరు తిరిగింది. అతను శారదవైపు చూశాడు. ఆమె తల దించుకున్నది.